www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -97 బుధవారం 22జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ప్రధాని నివాసం ముందు

# కాంగ్రెస్ ఆందోళన

### రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్



**కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత**

**అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు**

**రాహుల్ గాంధీ మాట మార్చారు**

**: కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

**న్యూఢిల్లీ,21జూలై (ప్రజావినికిడి):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు.

మిగతా 2లో.



## నీట్ పేపర్ లీక్
# మహా పాపం



**నీట్ పేపర్ లీక్ దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న ప్రధాని మోదీ**

**పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించాలని సూచన**

**పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులపై లాఠీ-ఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం**

**విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళనకారుల డిమాండ్**

**నిరసనకారులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు.. కొనసాగుతున్న ఉత్కంఠ**

**న్యూఢిల్లీ,21జూలై :(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని ఆయన పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను నిరోధించడం జాతీయ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇవాళ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం

మిగతా 2లో.




## 'తల్లికి వందనం' నేడే

**తొలి విడతలో ఈ రోజు 64.76 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**తల్లుల బ్యాంకు ఖాతాల్లో 13 వేల చొప్పున జమ చేయనున్న ప్రభుత్వం**

**ఆగస్టు 30న రెండో విడత అమలు**

**అమరావతి,21జూలై (ప్రజావినికిడి):** విద్యార్థుల చదువు వారి కుటుంబాలకు భారం కాకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం రెండో ఏడాది నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం నుంచే నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సారి రెండు విడతలుగా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

మిగతా 2లో.

## నలుగురు రైతులు చనిపోయినా
# బాధ్యత లేదా..?

### వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

**కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత**

**ఆదిలాబాద్,21జూలై (ప్రజావినికిడి):** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేడు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేడు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన

మిగతా



## డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేపీసీలతో ముఖాముఖి

**ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్**

**చట్టబద్ధత ఇవ్వాలని జెఎసిల డిమాండ్**



**హైదరాబాద్,21జూలై :(ప్రజావినికిడి):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు),

మిగతా 2లో.

## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి



**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిలా

మిగతా 5లో.




## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

**ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం**

**వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి**

**కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి**

**హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**హన్మకొండ,21జూలై (ప్రజావినికిడి):** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

మిగతా 2లో.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు**

**ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి**



**హైదరాబాద్,21జూలై :(ప్రజావినికిడి):** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన

మిగతా 2లో.

# ‘తల్లికి వందనం’ నేడే

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పటికే యూడైస్ ద్వారా నమోదైన విద్యార్థులకు తొలి విడత బుధవారం నిధులు జమచేయనున్నారు. ఇక, ఈ ఏడాదే కొత్తగా స్కూళ్లలో చేరిన విద్యార్థులకు రెండో విడతలో ఆగస్టు 30న పథకాన్ని అమలు చేస్తారు. తొలి విడతలో 64.76 లక్షల మంది విద్యార్థులకు నిధులు అందనున్నాయి. బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిధుల జమ ప్రక్రియ కొనసాగుతుంది. ఇంకా వివరాలు ధృవీకరించాల్సిన విద్యార్థులు, ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరేవారికి రెండో విడతలో నిధులు విడుదల చేస్తారు. మొత్తం ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు ‘తల్లికి వందనం’ పథకాన్ని వర్తింపజేయాలని పాఠశాల విద్యాశాఖ అంచనా వేసింది. 42.7 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది. దీనికిగాను ప్రభుత్వం రూ.10,121 కోట్లు వెచ్చిస్తోంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలను ఈ పథకంలో కేటాయించారు. అయితే, ఆయా పాఠశాలల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయించి.. రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే ‘అమ్మఒడి’ అమలు చేయగా, కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. దీం తో గత ప్రభుత్వంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి వస్తోంది.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

**మొదటిపేజీ తరువాయి**

ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్టాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. ’నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జ్‌గా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం’ అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

----------------

# యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యం

## అధికారులపై మండిపడ్డ సిఎం రేవంత్

**హైదరాబాద్,జులై 21(ప్రజావినికిడి)::** హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్ లో ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశం ఇచ్చారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవన్న సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ కు వెనకాడొద్దన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు
లబ్దిదారులకు అందజేయాలని ఆదేశించారు.

# సీజేపీ ఆందోళనలు.. విద్యార్థులతో చర్చలకు కేంద్రం సిద్ధం!

**న్యూఢిల్లీ, జూలై 21, ::** నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం చేపట్టిన ‘చలో పార్లమెంట్’ యాత్ర ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం.
ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే చీూా పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది.నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ‘చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని‘ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే.ఇంకోవైపు నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. మంగళవారం న్యూఢిల్లీలో మంగళ్ మిలన్ పేరిట ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘోర పాపమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ ఆందోళన

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ



అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో
ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. ‘నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు‘అని జితేంద్రసింగ్ అన్నారు.

# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా..?

నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో
రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ మహా పాపం

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేని పటిష్ఠమైన (ఫూల్‌ప్రూఫ్) వ్యవస్థను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధాని కోరినట్లు రిజిజు తెలిపారు.చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతుగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఐక్యంగా ఉండాలని ప్రధాని కోరారు. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా పార్లమెంటులో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం ఎంపీలందరిపైనా ఉమ్మడి బాధ్యత ఉందని మోదీ అన్నట్లు రిజిజు వివరించారు.
నీట్ కుంభకోణంపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన వందలాది మంది విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను ‘బొద్దింకలతో‘ పోల్చిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏర్పడిన ‘కాక్రోచ్ జనతా పార్టీ‘ (సీజేపీ) ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తోంది.నీట్ పేపర్ లీక్ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, నిందితుల అరెస్టులకు దారితీసిందని ప్రధాని చెప్పినట్లు రిజిజు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే తిరిగి పరీక్ష నిర్వహించామని మోదీ నొక్కిచెప్పారన్నారు. మరోవైపు ఈ ఉద్యమానికి మద్దతుగా 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులపై పోలీసుల దమనకాండను చూశాక, ఆసుపత్రి నుంచే తన దీక్షను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు.
ఇదిలా ఉంటే.. తమను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో తమ నేతలు సమావేశమై డిమాండ్లతో కూడిన లేఖను సమర్పించారని సీజేపీ తెలిపింది. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని అంగీకరించిన నడ్డా, చర్చల ప్రతిపాదన నిరసనకారుల నుంచే వచ్చిందని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి**

చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు.
ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.
దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే




24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు
చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల పేరుతో మాటలు కాదు...

## చేతల్లో చూపించింది కేసీఆర్ ప్రభుత్వం..

**ఉద్యమకారులకు మేలు జరిగితే రాజకీయాలకు అతీతంగా స్వాగతిస్తాం..**

**తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె నారాయణ**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో జరిగిన పలు వేదికలపై తెలంగాణ అమరవీరుల గురించి గొప్పగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు,ఒక విషయం తెలంగాణ ప్రజలకు చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం,కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించిన ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలోని నాటి (టీఆర్ఎస్)నేటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం విద్యార్థులు,యువకులు, ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు.ఆ సమయంలో ఉద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడినవారు, ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రశ్నించిన వారు,నేడు ఉద్యమకారుల గురించిగొప్పలు చెప్పడం ప్రజలు గమనిస్తున్నారనిపేర్కొన్నారు.సభల్లో "ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తాం", "ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం", "ఆశయాలు నెరవేరుస్తాం" అంటూ కొత్త హామీలు ఇవ్వడం కాదు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను గౌరవించడం అంటే కేవలం స్తూపాలు నిర్మించడం మాత్రమే కాదని,వారి కుటుంబాలకు అండగా నిలవడం,ఉద్యమకారులకు న్యాయం చేయడం,ఇచ్చిన హామీలను అమలు చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ పాలనలో అమరవీరులకు గౌరవం,ఉద్యమకారులకు గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ రోజు నిజంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుని,ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తే మాకెంతోసంతోషమే.ఉద్యమకారులకు మేలు జరిగితే రాజకీయాలకు అతీతంగా స్వాగతిస్తాం.కానీ మాటలు ఒకలా,చేతలు మరోలా ఉండకూడదు.

తెలంగాణ కోసం త్యాగం చేసిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది అని మన్నె నారాయణ స్పష్టం చేశారు

# ఆర్యవైశ్య మహిళ సంగం ఆధ్వర్యంలో

## ఆషాఢ తొలి మంగళవారం..

**శాఖంబారి దేవిగా వాసవి మాత దర్శనం - ప్రత్యేక పూజల్లో భక్తుల వెల్లువ**





**షాద్‌నగర్,(ప్రజా వినికిడి):**పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాఢ మాసం తొలి మంగళవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం షాద్ నగర్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాఖంబారి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసు పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు,అర్చనలు,ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శాఖంబారి దేవి అలంకరణలో దర్శనమిచ్చినవాసవిమాతనుదర్శించుకునేందుకు మహిళలు, భక్తులుభారీసంఖ్యలోతరలివచ్చారు.అమ్మవారికిపూలు,పండ్లు,కూరగాయలతో విశేష అలంకరణ చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.భక్తులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి కుటుంబాల ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు గబ్బుల శ్రీలత,ప్రధాన కార్యదర్శులు మలిపెద్ది శ్రీదేవి,రాచమల్ల గీత,కోశాధికారి ఆగిరు ఉమాదేవి కమిటీ కార్యవర్గం ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# లింగారెడ్డిగూడలో ఘనంగా బొడ్రాయి పూజలు..

**గ్రామ రక్షణ,ప్రజల శ్రేయస్సు కోసమే బొడ్రాయి పూజలు..**

**పరిసరాల పరిశుభ్రతతోనే ప్రకృతి అనుగ్రహం లభిస్తుంది.. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామంలో సోమవారం సంప్రదాయబద్ధంగా బొడ్రాయి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ, గ్రామంలో శాంతి,భద్రత,అభివృద్ధి కోసం బొడ్రాయి పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.గ్రామ రక్షణలో భాగంగా కూడా బొడ్రాయి పూజలు చేస్తారు.పూర్వకాలంలో పెద్దలు మంచి వర్షాలు కురవాలని గ్రామ దేవతలను ఆరాధించి ప్రత్యేక పూజలు చేసేవారని ఆయన గుర్తు చేశారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సీతారామ పంతులు ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద రెండు యూప స్తంభాలు ఏర్పాటు చేశామని వివరించారు.యుప స్తంభాలు అనగా ఒక ఆవు,దూడ వీటిని గ్రామంలో వదిలేవారు. గ్రామంలోని చెరువులు, కాలువలు,ప్రకృతి వనరులను పరిరక్షించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ప్రకృతి అనుకూలించి వరుణదేవుడు కరుణించి మంచి వర్షాలు కురుస్తాయనిపేర్కొన్నారు.ప్రస్తుతం ప్రకృతి వనరులు ధ్వంసం కావడం,పరిసరాలు కలుషితమవడం వల్లే వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేయడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తే గ్రామాలకు మేలు జరుగుతుందని బక్కని నరసింహులు పిలుపునిచ్చారు.

# సేవ గుణంలో ముందున్న సామాజికవేత్త లయన్ మంచిరేవుల సాయి కృష్ణ..

**లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్ నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో**

**ఫరుక్ నగర్ కు చెందిన పేద యువతి పెళ్లికి 100 కేజీల బియ్యం బహుకరణ**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో గల సాయిరాజా కన్వెన్షన్ హాల్ లో ఫారుక్ నగర్ గ్రామానికి చెందిన పేద కుటుంబీకురాలు కుమ్మరి జయమ్మ కూతురీ పెళ్లికి సామాజికవేత్త మంచిరేవుల సాయి కృష్ణ(100) కేజీల బియ్యం లయన్స్ క్లబ్ షాద్ నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో అందజేసి తన ఉదారతను చాటుకున్నాడు.ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ, గత (10)పది సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ షాద్ నగర్ స్టార్ ఆధ్వర్యంలో అనేక అనేకమంది నిరుపేదలకు తనకు తోచిన ఆర్థిక సహాయం వస్తు,నగదు రూపాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ శరత్ చంద్రబాబు,పోస్ట్ డిస్టిక్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి,క్లబ్ అధ్యక్షుడు మంచిరేవుల అశోక్,డిసి జి.నారాయణసీనియర్ లైన్ మెంబర్ రాధాకృష్ణ,పి డి జి జి.రమేష్, లయన్ మెంబర్స్ మదన్మోహన్ రెడ్డి,సుధాకర్,మహేందర్ రెడ్డి,రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను వేధించింది కేసీఆర్ ప్రభుత్వమే..

**ఉద్యమకారుడు టీజీ శ్రీనివాస్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వేధించిందని తెలంగాణ ఉద్యమకారుడు షాద్ నగర్ వాసి టీజీ.శ్రీనివాస్ ఆరోపించారు.తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అసెంబ్లీలో 1,200 మంది తెలంగాణకోసంఅమరులయ్యారని ప్రకటించారని,

అయితే వారిలో ఎంతమంది కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.500 మందికి కూడా రూ.10 లక్షలు అందలేదని ఆయనఆరోపించారు.అమరవీరుల కుటుంబాల వివరాలు తమ ప్రభుత్వానికి తెలియవని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారని టీజీ శ్రీనివాస్ పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.

తెలంగాణ జనసేనాని ప్రొఫెసర్ కోదండరాం నుంచి రాంబల్ నాయక్ వరకు పలువురు ఉద్యమకారులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కోదండరాం పక్కన కూర్చున్న ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు ఇచ్చారని,కొంతమంది ఉద్యోగులను పదవుల నుంచి తొలగించారని అన్నారు. మరికొందరు ఉద్యమకారులపై కోర్టు కేసులు పెట్టి,ఎస్సీ,ఎస్టీ వేధింపుల కేసులతో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు.

షాద్ నగర్ లో తెలంగాణ ఉద్యమకారుడు గిరిజన బిడ్డ రాంబల్ నాయక్ పై కూడా రౌడీషీట్ కేసు పెట్టి వేధించారని గుర్తు చేశారు.

షాద్ నగర్ లో ఉద్యమకారులకు ఏం ఒరిగిందని ప్రశ్నించారు. ఎంతోమంది ఉద్యమం దెబ్బకు ఇంకా కోలుకోలేని పరిస్థితుల్లో యువత నిరుద్యోగులు ఉన్నారని టీజీ శ్రీనివాస్ అన్నారు.ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని టీజీ శ్రీనివాస్ అన్నారు.అందుకే ఉద్యమకారులు,ఉద్యోగులు బీఆర్ఎస్‌కు దూరమయ్యారని పేర్కొన్నారు.అధికారం కోల్పోయి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యమకారులను గుర్తించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవని గత ప్రభుత్వం ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు.తెలంగాణ ఉద్యమకారులపై ఎవరికీ పేటెంట్ లేదని స్పష్టం చేశారు. ఉద్యమకారుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించిన టీజీ శ్రీనివాస్,గత ప్రభుత్వం చేసిన తప్పులకు ముందుగా ఉద్యమకారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫాకల్టీ ) నియామకాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్.కమల తెలిపారు.కళాశాలలో ఇంగ్లీష్-2,తెలుగు-1, హిస్టరీ-1,జంతుశాస్త్రం1, సెరికల్చర్-1,గణితశాస్త్రం-1, కంప్యూటర్ సైన్స్-1విభాగాల్లో మొత్తం 8 ఖాళీలను భర్తీ చేయనున్నట్లువెల్లడించారు.సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు.అలాగే యూజీసీ నిబంధనల ప్రకారం నెట్,సెట్, స్లెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి,బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.నియామక ప్రక్రియను యూజీసీ మార్గదర్శకాలు,ఉన్నత విద్యా కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన విద్యార్హతల ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను జులై 23వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# ఈదురు గాలుల వర్షానికి బర్రె మృతి

**రైతు మహేష్‌కు ఆర్థిక నష్టం**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

ఫరూక్‌నగర్ మండలంబుచ్చిగూడ గ్రామానికి చెందిన చీపిరి మహేష్ యాదవ్ అనే రైతు కుటుంబానికి అకాల వర్షం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జీవనాధారంగా భావించి ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న బర్రె ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం ప్రభావంతో కట్టి ఉంచిన బర్రె మృతి చెందింది. నిన్న రాత్రి పాలు పిండి ఇంటికి వెళ్ళి ఉదయం పాలకోసం అని పొలం దగ్గరకి వెళ్ళి చూడగానే మృతి చెంది నట్టు గుర్తించాడు సుమారు ఒక లక్ష (100000) రూపాయలు ఉంటుంది అనీ మహేష్ అనే రైతు తెలిపాడు. ఈ ఘటనతో మహేష్ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. మహేష్ కుటుంబం ప్రధానంగా పశువుల పెంపకంపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. పశువులే మా జీవనఆధారం అని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువుల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్న సమయంలో ఈ ఘటన జరగడంతో వారికి ఆర్థిక నష్టం జరిగింది. ఒకవైపు అకాల వర్షాలు రైతులు, పశుపోషకులను ఇబ్బందులకు గురిచేస్తుండగా, మరోవైపు పశుసంపద కోల్పోవడం మహేష్ కుటుంబానికి మరింత భారంగా మారింది.ఈ ఘటనపై స్థానికులు స్పందిస్తూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పశు పోషకులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నారు. చీపిరి మహేష్ అనే రైతు కుటుంబానికి ఆర్థికంగా చేయూత అందించాలని అభిప్రాయపడుతున్నారు.

# ఫరూక్ నగర్&షాద్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ శాశ్వత కార్యాలయాలకు (35)ముప్పై ఐదు గుంటల భూమి కేటాయింపు

**సంవత్సరం గడువులో భవనాల నిర్మాణం పూర్తి..**

**ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య ద్వారా స్థలాన్ని స్వాధీన పరచుకున్న సబ్ రిజిస్టర్ అధికారులు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని ఫరూక్ నగర్&షాద్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు సంబంధించి శాశ్వత భవనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని భావించిన ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజల కష్టాలను తీర్చే దిశలో ముందడుగు వేసి షాద్ నగర్ పాత హైవే పక్కన గల పాత కోర్టు స్థలాన్ని సర్వే నెంబర్ (178)లో 35 గుంటల స్థలాన్ని ఫరూక్ నగర్ తహసిల్దార్ నాగయ్య సమక్షంలో స్థానిక ఫరూక్ నగర్ ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ వికాస్ రెడ్డి అలాగే షాద్ నగర్ సబ్ రిజిస్టర్ శేషగిరిలకు మంగళవారం రోజున హద్దులు నిర్ణయించి స్థలాన్ని వారికి స్వాధీన పరచడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక సంవత్సరం గడువు లోపల భవనాల నిర్మాణాలు పూర్తిచేసుకుని అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

# షాద్‌నగర్ ఆర్టీసీ డిపోపై వస్తున్న ఆరోపణలు నిరాధారం..

**షాద్ నగర్ డీఎం, ఎంఎఫ్‌ఓపై అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదంటున్న అధికారులు.. అద్దె బస్సు యజమానులు..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ (డీఎం),ఎంఎఫ్ఓపై అద్దె బస్సుల యజమానులు చేసిన అవినీతి ఆరోపణలను అధికారులు ఖండించారు. అదేవిధంగా అద్దె బస్సు యజమానులు మీడియా సమక్షంలో మాట్లాడుతూ, ఈ ఆరోపణలు అద్దె బస్సు యజమానులు చేయలేదని, కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం డిపో ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వారు అన్నారు. మామూళ్లు డిమాండ్ చేశారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా షాద్ నగర్ ఆర్టీసీ డిపో అధికారులు,




సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ, డిపోలో అన్ని వ్యవహారాలు ఆర్టీసీ నిబంధనల ప్రకారమే పారదర్శకంగాజరుగుతున్నాయని, బస్సుల నిర్వహణ,తనిఖీలు,చెల్లింపులు అన్నీ నిబంధనల మేరకే నిర్వహిస్తున్నామని తెలిపారు. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక లోపాలు లేదా ఒప్పంద నిబంధనలకు సంబంధించిన కారణాల వల్ల మాత్రమే బస్సులను నిలిపివేస్తామని,వ్యక్తిగతంగా ఎవరినీ వేధించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం డిపో ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అధికారులు ఆరోపించారు. అవసరమైతే ఈ వ్యవహారంపై పూర్తి విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని,నిజాలు బయటకు వస్తాయని వారు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ, డిపో ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు మరోసారి పునరావృతమైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# బాలికల వసతి గృహంలో బోర్ డ్రిల్లింగ్ పనులు

**ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్..**



**షాద్‌నగర్,(ప్రజా వినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు.

కళాశాల ప్రిన్సిపాల్ సులోచన, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన ఈ పనులను షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బోర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ప్రిన్సిపాల్ సులోచన,కౌన్సిలర్ బచ్చలి నరేష్,పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), కొప్పునూరి ప్రవీణ్,మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్,ముబారక్ అలీఖాన్, తంగడపల్లి శంకర్,క్యూసెట్.శ్రీనివాస్,రమేష్ గౌడ్, రామచందర్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభ పోస్టర్ విడుదల

**మహాసభలను విజయవంతం చేయండి. -జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**శంషాబాద్, (ప్రజావినికిడి):**

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగబోతున్నాయి ఆ మహాసభల గోడపత్రికలను నేడు శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం




నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యల పైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇక్కడ నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, కే.చందు యాదవ్, డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి, మంజుల, రాములు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర కాలనీపబ్లిక్ పార్కును ఆక్రమణల నుండి కాపాడండి

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. -హైడ్రా కమీషనర్ రంగనాథ్ ని కలిసిన ఎమ్మెల్యే, కాలనీ వాసులు**

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**

ఎల్బీనగర్ నియోజకవర్గబైరామల్ గూడలోని ఎస్.వి.కాలనీ (శ్రీ వెంకటేశ్వర కాలనీ) పబ్లిక్ పార్కును ఆక్రమణల నుండి రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్.వి.కాలనీవాసులు హైడ్రా కమీషనర్ రంగనాథ్ ని వారి కార్యాలయంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఇట్టి పార్క్ అభివృద్ధి కోసం దాదాపు 12 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. అని అట్టి పార్కుల్లో వాకింగ్ ట్రాక్ అదేవిదంగా అందమైన మొక్కలు నాటించడం జరిగింది అని తెలిపారు. అనంతరం అట్టి పార్కు నందు అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్న నేపథ్యంలో అట్టి నిర్మాణాలను తొలగించి పార్కును పూర్తి స్థాయిలో పునరుద్ధరణ చేయాలని కోరారు. అలాగే అందులో ఒక రేకుల షెడ్డు అక్రమంగా నిర్మించడం జరిగింది తెలిపారు. కావున అట్టి రేకుల షెడ్డుని తొలగించాలని కోరారు. అనంతరం కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, తప్పకుండ రెండు రోజుల్లో మా యొక్క



సిబ్బందిని పంపించి మీ యొక్క పార్క్ ఆక్రమణల నుండి విడిపించి కాలనీవాసులకు పార్క్ అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. దానికి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు రాజిరెడ్డి,కాలనీ అధ్యక్షులు అమృత రెడ్డి,ఉపాధక్షులు బాలస్వామి,కోశాధికారి అనంతరెడ్డి,గౌరవ సలహాదారులు విశ్వనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్ రెడ్డి,సభ్యులు శ్రీనివాస్,రాజేందర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# దిల్ సుఖ్ నగర్ లో ఘనంగా

## 'ది నవాబ్స్ రెస్టారెంట్' 5వ బ్రాంచ్ ప్రారంభోత్సవం



**దిల్సుఖ్నగర్,(ప్రజావినికిడి):** నగర భోజన ప్రియులకు సుపరిచితమైన 'ది నవాబ్స్ రెస్టారెంట్' తమ 5వ బ్రాంచ్‌ను సోమవారం దిల్ సుఖ్ నగర్ లో ఘనంగా ప్రారంభించింది. ఈ నూతన బ్రాంచ్‌ను రెస్టారెంట్ యాజమానులు సయ్యద్ మొహియుద్దీన్, సయ్యద్ అయ్మాన్, సయ్యద్ హర్వాన్ లు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. కస్టమర్ల ఆదరాభిమానాలు,పెద్దల ఆశీస్సులతోనే తాము ఈ స్థాయికి చేరుకున్నామని యాజమాన్యం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది. గచ్చిబౌలిలోని ప్రధాన బ్రాంచ్‌కు వచ్చే కస్టమర్ల భారీ డిమాండ్ మేరకే ఇక్కడ కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. నాణ్యమైన ఆహారాన్ని, పరిశుభ్రమైన వాతావరణంలో ఉత్తమ సర్వీసుతో అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కఠినమైన ఎఫ్ఎస్–ఎస్ఏఐ నిబంధనలను పాటిస్తూ,బెస్ట్ క్వాలిటీ ఫుడ్ అందిస్తూ కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. ఈ రెస్టారెంట్లో మటన్ మరాగ్, పత్తర్ కా గోష్, జాఫ్రానీ బిర్యానీతో పాటు అద్భుతమైన డెజర్ట్స్ తమ ప్రత్యేకత అని నిర్వాహకులు వివరించారు. ముఖ్యంగా ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా పరిచయం చేసిన 'నవాబ్స్ మటన్ మరాగ్'భోజన ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# ఉప్పొంగిన బొగత జలపాతం

**వాజేడు,జులై 22,(ప్రజావినికిడి):**

చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న నయాగర బొగత జలపాతం (వాటర్ పాల్స్)గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప్పొంగి ప్రవహిస్తుంది టూరిస్టులను కనువిందు చేస్తుంది.

# భారీ వర్షాలతో కొట్టుకుపోయిన డైవర్సన్ రోడ్డు

## 25,గ్రామాలు, ఛత్తీస్ గఢ్,కు రాకపోకలు బంద్

## నిర్మాణం మొదలు పెట్టిన పూర్తికాని తాత్కాలిక రోడ్డు -కాలినడకకు మాత్రమే అనుమతి







**వాజేడు,జులై 22,(ప్రజావినికిడి):**
వాజేడు మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎన్ఎచ్ 163,వ రహదారి చీకుపల్లి, పెద్దగొల్లగూడెం,గ్రామాల మధ్య ఉన్న ఇసుక వాగు బ్రిడ్జి నిర్మాణం జరుగుతుంది దీనికి తాత్కాలిక రోడ్డు నిర్మించారు భారీ వర్షాల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటలకు సమయంలో తాత్కాలిక రోడ్డు కొట్టుకపోయింది దీనితో మండలంలోని 25 గ్రామాలు ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి భారీగా వాహనాలు నిలిచిపోయాయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మండల ఆధికారులు తాసిల్దార్, ఎంపీడీవో, సిఐ,ఎస్ఐ, పరిస్థితిని సమీక్షించారు. వరద ప్రభావం తగ్గిన వెంటనే తాత్కాలిక రోడ్డు నిర్మించాలని సూచించారు రాకపోకలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు సాయంత్రం వరద తగ్గడంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన చీకటి పడటంతో రోడ్డు పూర్తి కాలేదు సింగల్ లైన్ తూరాలు వేసి మట్టి పోశారు ప్రస్తుతం కాలినడకకు మాత్రమే అనుమతించారు తాత్కాలిక రోడ్డు బుధవారం పూర్తయ్యే అవకాశం ఉంది.

# శిశువును రోడ్డుపై వదిలేసిన దుండగులు..

**శంషాబాద్,(ప్రజావినికిడి):**
శంషాబాద్ కేంద్రంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. రెండు క్రితం పుట్టిన ఆడశిశువును రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. శిశువును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శంషాబాద్ కేంద్రంలోని ఎయిర్పోర్ట్ కాలనీ,ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై శిశువు ఉన్నట్టు మంగళవారం ఉదయం 11:30 గంటలకు డయల్-100కు సమాచారం అందడంతో ఆర్జీఐఏ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఒకటి నుంచి రెండు రోజుల వయస్సు ఉన్నట్లు భావిస్తున్న ఆడ శిశువును ఓ తెల్లటి సంచిలో గుర్తించారు. వెంటనే శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన సంరక్షణ కోసం అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌కు తరలించారు. శిశువును రోడ్డుపక్కన వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తుల పై కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ శిశువు గురించి ఎవరికైనా సమాచారం ఉంటే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.



# టూరిస్టులకు జరిమానా విధింపు



**వాజేడు,(ప్రజావినికిడి):**దూలాపురం రేంజ్ పరిధిలోని కొంగల తూర్పు బీట్ లో గుండం జలపాతం లోకి అక్రమంగా వెళ్ళెందుకు ప్రయత్నించిన వరంగల్ కు చెందిన నలుగురు యువకులకు వెంకటాపురం అటవీ శాఖ అధికారులు ట్రెస్ పాసు కేసు నమోదు చేసి 8,000,రూపాయలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు ఫారెస్ట్ అధికారులు నిషేధం విదించిన జలపాతలకు వెళ్ళకూడదు అని ఈ సందర్భంగా వారు తెలిపారు

# భారీ వర్షాల మధ్య గర్భిణికి సకాలంలో వైద్యం

## అధికారుల సమన్వయంతో సురక్షితంగా ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలింపు

**వాజేడు,జులై 22,(ప్రజావినికిడి):**
గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జాతీయ రహదారి చీఎన్ఎచ్-163,పై ఇసుకవాగు బ్రిడ్జి సమీపంలో రహదారి కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సమయస్ఫూర్తితో స్పందించి ఒక గర్భిణికి సకాలంలో వైద్యం అందించారు మంగళవారం మధ్యాహ్నం సుమారు 3. గంటలకు, అయ్యవారిపేట గ్రామానికి చెందిన కావేరి అనూష, భర్త సత్యనారాయణ, ఐదవ కాన్పు కోసం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వైద్యులు పరీక్షించగా ఆమె రక్తహీనత తీవ్రంగా ఉండి హీమోగ్లోబిన్ కేవలం 5 గ్రాములు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో ప్రసవ నొప్పులు ప్రారంభం కావడంతో వెంటనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు.
ప్రసవానంతరం తల్లి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయాలని నిర్ణయించారు. అయితే భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారులు



పూర్తిగా దెబ్బతినడంతో అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీంతో మండల అధికారులు ఎంపీడీవో, ఎంఆర్ఓ,ఎస్సై, గ్రామపంచాయతీ ప్రతినిధులు, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొదట గర్భిణిని ఆటోలో పేరూరు నుంచి శ్రీరామ్‌నగర్ గ్రామానికి తరలించారు. అక్కడి నుంచి అడవి మార్గంలో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌లో రెండు వాగులను దాటి, ఎడ్లబండి మార్గం గుండా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కోయ వీరాపురం గ్రామానికి చేర్చారు. అనంతరం అక్కడ సిద్ధంగా ఉన్న



108 అంబులెన్స్ ద్వారా గర్భిణిని ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు.
ఈ మొత్తం ప్రక్రియలో ఆరోగ్య శాఖ సిబ్బంది, మండల అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు సమిష్టిగా కృషి చేసి తల్లి, శిశువుకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారం, ఆరోగ్య సిబ్బంది అంకితభావం ప్రజల ప్రాణాలను కాపాడడంలో ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# నీట్ పేపర్ లీక్ కేంద్రం జవాబుదారీతనం వహించాలి

## తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మాజీ జట్పిటీసి

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని, అలాగే తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యూఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, శ్రీమతి ప్రియాంక గాంధీ చేపట్టిన ధర్నాకు సంపూర్ణ సంఘీభావంనీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశ యువత భవిష్యత్తుపై తీవ్రమైన అనుమానాలను కలిగించింది. న్యాయం కోరుతూ గళం విప్పిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం,వారిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యార్థుల గొంతును అణచివేయడం కాదు,వారి ఆవేదనను వినడం ప్రభుత్వ బాధ్యతదేశ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేపట్టిన ఈ పోరాటానికి మనమందరం మద్దతు ప్రకటించాలి అని అన్నారు.



# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ చేయాలి

**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**
ఢిల్లీలో యువత, విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయులు ఉపయోగించి బలప్రయోగం చేయడాన్ని ఖండిస్తూ, నీట్-యు.జి, యు.జి.సి-నెట్ వంటి పరీక్షలలో ప్రశ్నపత్రాల లీకేజీలు, మూల్యాంకన వివాదాలు సహా అనేక తీవ్రమైన అక్రమాల నేపథ్యంలో,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూజూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్, హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఏ.ఐ.వై.ఎఫ్ శ్రేణులు ప్లకార్డులు చేతబూని, ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ చేయాలనీ, ఎన్.టి.ఏ ను రద్దు చేయాలనీ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్లేకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ పాలనలో విద్యాశాఖ వ్యవస్థ పూర్తిగా బలహీనపడిందని, ధర్మేంద్ర ప్రధాన్




అవినీతి వల్ల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసమర్థంగా, పనికిరానిదిగా మారి విద్యార్థులు పట్ల శాపంగా మారిందని దుయ్యబట్టారు. "కుంభకోణాలు" జరుగుతున్నాకేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనిలక్షలాది మంది విద్యార్థుల ఏళ్ల తరబడి కఠోర శ్రమకు కేంద్ర బీజేపీ ప్రభుత్వ దృష్టిలో ఏమాత్రం విలువ లేదని పేర్కొన్నారు. తక్షణమే ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరఫ్ తోపాటు ఎన్.టి.ఏ ను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఢిల్లీలో యువత, విద్యార్థుల నిరసనలపై పోలీసులు జరిపిన లాఠీచార్జీని, బాష్పవాయువు ప్రయోగాన్నిఏ.ఐ.వై.ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని, నీట్ పేపర్ లీకేజీలు, నిరుద్యోగం తదితర విద్యా వ్యవస్థ సంక్షోభాలపై విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు చేపట్టిన శాంతియుత నిరసనలను అణచివేయడం దుర్మార్గమని, మోదీ ప్రభుత్వం నియంతృత్వం ఇలాగె కొనసాగిస్తూ యువత, విద్యార్థులు తిరుగుబాటు తప్పదని నిర్లేకంటి శ్రీకాంత్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏ.ఐ.వై.ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్.బాలకృష్ణ, నాయకులు కళ్యాణ్, మహేష్, ఎం.భగతసింగ్, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అబాకస్ శిక్షణతో అద్భుత ప్రతిభ..

## రీజినల్ ప్రాడిజీలో నాగోల్ విద్యార్థుల విజయభేరి..

**నాగోల్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ జోనల్ పరిధిలోని సిప్ అబాకస్ అకాడమీ - నాగోల్ బ్రాంచ్ విద్యార్థులు జూలై 12న నిర్వహించిన రీజినల్ ప్రాడిజీ-2026 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు అవార్డులను సొంతం చేసుకున్నారు. 3,300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో నాగోల్ బ్రాంచ్‌కు చెందిన చిన్నారులు 1వ,2వ,3వ కేటగిరీల్లో విజేతలుగా నిలవడంతో పాటు పర్ఫార్మర్ అవార్డులు కూడా అందుకున్నారు. సెంటర్ హెడ్ రాధికా కుండే శిక్షణలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ విజయానికి అకాడమీ సిబ్బంది ఆర్.సౌమ్య,పి.రిషిత,పి.శ్రావణి,ఎన్.వరలక్ష్మి,వి.మౌనిక,బి.శారదా దేవి,ఎం.అరుణ అందించిన శిక్షణ,సహకారం ఎంతో దోహదపడింది.



**విజేతలుగా నిలిచిన విద్యార్థులు..:**డి.మార్తా ప్రిన్సెస్,సాయి సుశాంత్,ఆర్.జశ్వంత్ సాయి కుమార్,జి.అశ్మిత్ రెడ్డి,రితిక్ బొజ్జం,డి.ప్రతీక్,ఎం.స్నేహల్ రెడ్డి,వల్లపు శ్రీవత్సవ్,పునీత్ సాయి కొల్లిపారా,బి.దివిజ్,పి.హన్విక,ఈ సందర్భంగా విజేతలను సెంటర్ హెడ్ రాధికా కుండే మాట్లాడుతూ ముందుగా తమ విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అబాకస్ శిక్షణ వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలు ఎంతో విశేషమైనవి. చిన్న వయస్సులోనే అబాకస్ నేర్చుకోవడం ద్వారా గణితంపై భయం తగ్గి, క్లిష్టమైన లెక్కలను వేగంగా చేయగల సామర్థ్యం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, పరిశీలనా శక్తి, తార్కిక ఆలోచన, ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. చదువులో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు పోటీ పరీక్షలకు కూడా బలమైన పునాది ఏర్పడుతుంది. తల్లిదండ్రులకు కూడా ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పిల్లల్లో క్రమశిక్షణ, సమయపాలన, ఆలోచనా విధానం మెరుగుపడటంతో పాటు మొబైల్,టీవీలపై ఆధారపడే సమయం తగ్గి, చదువుపై ఆసక్తి పెరుగుతుంది. పిల్లల సమగ్ర మేధో వికాసానికి అబాకస్ శిక్షణ ఒక ఉత్తమ సాధనంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులు,సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి







**మొదటిపేజీ తరువాయి**
ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



## పశ్చిమాసియా యుద్ధంతో అమెరికా అడ్వైజరీ జారీ

### ప్రపంచంలోని అమెరికాను పౌరులకు హెచ్చరికలు

### అప్రమత్తంగా ఉండాలని సూచనలు

**వాషింగ్టన్,జూలై 21 (ప్రజావినికిడి)::**పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు 'వరల్డ్‌వైడ్ కాషన్' పేరుతో భద్రతా హెచ్చరిక జారీ చేసింది. అమెరికన్లు విదేశాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించింది.పశ్చిమాసియలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా ప్రయోజనాలు, పౌరులను

లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ముఖ్యంగా అమెరికా రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను కచ్చితంగా పాటించాలని పౌరులకు సూచించింది. వసరం లేని ప్రయాణాలను నివారించాలని, జనసమ్మర్థ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, స్థానిక వార్తలు, భద్రతా హెచ్చరికలను నిరంతరం గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ సూచనలను అనుసరించాలని, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించింది. గత కొద్ది రోజులుగా ఇరాన్‌పై అమెరికా వరుస దాడులు చేస్తోంది (ఎసజీని జా ఇనీన్గ్÷తిఇబి). ఇరాన్‌లోని పలు కేంద్రాలపై వైమానిక దాడులు చేస్తోంది. అందుకు ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ నేపథ్యంలో పలు దేశాల్లో ఉన్న అమెరికా పౌరులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక జారీ చేసింది.

## పాక్‌తో సింధూనదీ జలాల ఒప్పందం

### ఇప్పుడున్నట్లుగా కొనసగాడం కుదరదు -కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,జూలై 21(ప్రజావినికిడి):**



సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవు తుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది . అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ (ఖజీతిబబిజీని) చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజెక్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారాలకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఒప్పందం కుదిరింది.

## తమ్మినేని భూ ఆక్రమణపై చర్యలు తప్పవు

### వైసిపి ఐదేళ్ల భూభాగోతాలపై పూర్తిస్థాయి విచారణ

### రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



**అమరావతి,జూలై 21(ప్రజావినికిడి):**వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం భూ అక్రమాలతో తప్పకుండా చర్యలు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమి పట్ల చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పార్టీకి రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి అనగాని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే ఆర్ఎస్కేలు అని వెల్లడించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టం చేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే వారు కూడా దీని పట్ల సానుకూలంగా స్పందించారని అన్నారు. కొందరు కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు ఓ నూతన సాంకేతిక విధానమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్కే)ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టంచేశారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు.. ఒక నూతన సాంకేతిక విధానమని తెలిపారు. గొడ్డలి పార్టీ రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. తమ్మినేని భూ అక్రమాలతో పాటు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. గత 5 ఏళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

# ఉరుముతున్న యుద్ధమేఘాలు !

**జూలై 21(ప్రజావినికిడి):**




పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు..ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్ధాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు.శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్ధానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశు ద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# అసోంను ముంచెత్తిన వరదలు

### భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం -పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు

**గౌహతి,జూలై 21 (ప్రజావినికిడి):** అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లాముఠాఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు



ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.

# భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

**: సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన**

**భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు**

**దీని వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని వ్యాఖ్య**

**జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన అంశమన్న సుప్రీంకోర్టు**



**జూలై 21 (ప్రజావినికిడి):**

వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. "ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం" అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.


# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన



2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. ‘ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్‌గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్‌కప్‌నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్‌పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్’ అని కోచ్ అన్నారు.

పురుషుల హాకీ వరల్డ్‌కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్ (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్ (1975లో) ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన టీమ్‌ఇండియా టైటిల్ ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా 2-1 తేడాతో పాక్‌ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్‌ను సాధించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్‌కప్‌లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా ‘కప్పును ఇంటికి తీసుకొస్తాం’ అని ధీమాగా చెప్పాడు. ‘వరల్డ్‌కప్‌ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్‌కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం’ అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..



ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్లు జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది. టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..తొలి టీ20: జులై 23 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌రెండో టీ20: జులై 25 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌మూడో టీ20: జులై 26 - హరారే స్పోర్ట్స్ క్లబ్‌జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)



# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

# స్పెయిన్‌కు సుమారు రూ.430 కోట్ల ప్రైజ్ మనీ



2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఘన ముగింపు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రూథర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆగిపోయాయి. మరోవైపు యువ ఆటగాళ్లతో బలంగా కనిపించిన స్పెయిన్ చరిత్రలో రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో స్పెయిన్‌కు ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత గౌరవంతో పాటు భారీ ఆర్థిక లాభం కూడా దక్కింది. ఫిఫా ప్రకటించిన రికార్డు స్థాయి ప్రైజ్ ఫండ్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్‌కు 50 మిలియన్ అమెరికన్ డాలర్లు లభించనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.430 కోట్లకు సమానం. పురుషుల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో విజేతకు లభించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఫైనల్లో ఓడిపోయినా అర్జెంటీనా ఖాళీ చేతులతో వెళ్లలేదు. రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టుకు 33 మిలియన్ డాలర్లు దక్కనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.284 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ పొందిన మొత్తంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఇంగ్లండ్‌కు 29 మిలియన్ డాలర్లు (సుమారు రూ.249 కోట్లు), నాలుగో స్థానంలో నిలిచిన ఫ్రాన్స్‌కు 27 మిలియన్ డాలర్లు (సుమారు రూ.232 కోట్లు) ప్రైజ్ మనీ లభించనుంది.ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో నేతృత్వంలోని ఫిఫా కౌన్సిల్ 2025 డిసెంబరులో ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 ప్రపంచకప్ కోసం మొత్తం 655 మిలియన్ డాలర్ల ప్రైజ్ ఫండ్‌ను కేటాయించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5,630 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం అధికం. అంతేకాకుండా టోర్నమెంట్‌కు అర్హత సాధించిన ప్రతి జట్టుకు సిద్ధత ఖర్చుల కోసం అదనంగా 1.5 మిలియన్ డాలర్లు కూడా అందజేశారు. అంటే సుమారు రూ.13 కోట్లకు పైగా ప్రతి జట్టుకు ముందుగానే లభించింది. టోర్నమెంట్‌లో వ్యక్తిగత అవార్డుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపే మెరిశాడు. మొత్తం 10 గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అతడు నాలుగు అసిస్ట్‌లు కూడా నమోదు చేశాడు. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచకప్‌తో ఎంబాపే తన కెరీర్ వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 వరల్డ్‌కప్ గోల్స్‌తో ఉన్న మెస్సి రికార్డును అధిగమించిన ఆటగాడిగా నిలిచాడు.ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది. టోర్నమెంట్ మొత్తం స్పెయిన్ ఆటను నియంత్రించడంలో, మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయించడంలో రోడ్రీ కీలక పాత్ర పోషించాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పాస్‌లు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా అతడు రికార్డు సృష్టించాడు. స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో రోడ్రీ ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది.

# ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

## ఓవరాల్ చాంపియన్‌గా మేడ్చల్ మల్కాజ్‌గిరి

హైదరాబాద్ :మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన 11వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్‌జిల్లా స్విమ్మింగ్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. 54 పసిడి పతకాలు, 50 రజత పతకాలు, 26 కాంస్య పతకాలు సాధించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి రాష్ట్ర స్థాయిలో ఓవరాల్‌గా చాంపియన్‌గా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి 472 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 293 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా.. ఆ జిల్లా స్విమ్మర్లు 34 పసిడి, 25 సిల్వర్, 24 కాంస్య పతకాలు కొల్లగొట్టారు.స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు నిలిచిన క్రీడాకారులకు, ఓవరాల్ చాంపియన్‌షిప్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లాలకు తెలంగాణ స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జి ఉమేష్‌లు బహుమతులు ప్రదానం చేశారు.



# షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.



# చరణ్ సరసన రష్మిక?..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



## శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల


ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.

## పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార




తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు. సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్ర్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెశిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

## 'టాక్సిక్' నుంచి రెండో పాట.. యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613